క్లుప్తంగా

వామనాలంకారంలో అప్పన్న



సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఐదవరోజు మంగళ వారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వామ నాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వామనుడి అలంకరణ చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతం గా పల్లకీలో అధిష్టింజేశారు. ఆళ్వారులను వేరొక పల్లకీలో కొలువుంచి, సింహగిరి మాడ వీధిలో సాయంత్రం తిరువీధి వైభవంగా నిర్వ హించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని, ఆశీస్సులు పొందారు. దేవస్థానం పూర్వ ఈవో, విజయనగరం డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి పల్లకీ మోశారు.

సింహగిరిపై ముగిసిన ధారోత్సవాలు



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ధారోత్సవాలు మం గళవారంతో ఘనంగా ముగిశాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిం దరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, గోదాదేవిలను ఒక పల్లకీలో, మదన గోపాలస్వామిని వేరొక పల్లకీలో అధిష్టింపజేశారు. సువర్ణ, చతుర్భుజ తాయారు అమ్మవార్లను, ఆళ్వార్లను మరో పల్లికిలో కొలువుంచారు. మేళతాళాల మధ్య ఆలయంలో నుంచి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై వేంజేపచేసి స్నపనాన్ని నిర్వహించారు. అనంతరం గం గధార వద్ద ఉన్న ప్రాచీన మండపంలో స్వామి ని, అమ్మవార్లను కొలువుంచి విశేష అలంకరణ చేశారు. 30వ పాశుర విన్నప పఠనాన్ని చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు రంగనాథ్ తదితరులు కార్యక్ర మాలను నిర్వహించారు.

కోడి పందాల్లో నలుగురి అరెస్ట్

పరవాడ: మండలంలోని ఈ బోనంగి, బొద్దపు వానిపాలెం గ్రామాల్లో సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడి పందాలు నిర్వహిస్తున్న శిబిరాలపై పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం విస్తృతం గా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో కోడి పందాలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి నాలుగు కోడి పుం జులు, రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకు న్నట్లు సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు.

ఘనంగా భారత సైనికుల దినోత్సవం



మాట్లాడుతున్న మాజీ సైనికోద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు

అగనంపూడి : దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న భారత సైనికుల సేవలు, త్యాగం ఎన లేనిదని అగనంపూడిలోని పైడిమాంబ మాజీ సైనికోద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు విం దుల శ్రీనివాసరావు అన్నారు. భారత సైనికుల దినోత్సవం సందర్భంగా పెదమడకలో నిర్వ హించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో ఎండకు ఎండి, వానకు తడిసి, చలికి వణికి ప్రాణాలు ఫణంగా పెట్టి కాపలా కాస్తున్న భారత సైనికులు అభినందనీయుల న్నారు. అర్హులైన మాజీ సైనికులకు మూడు నుంచి ఐదెకరాల పొలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, పి.రామ అప్పారావు, బి.సత్యనారాయణ, ఎం .వి.రమణ, వి.నారాయణరావు, జి.నాగరాజు, వి.రాజు, మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.

ప..రసమయం!



పరసలో నాటిక ప్రదర్శన(ఫైల్)



చిన్నారులకు కావలసిన సామగ్రి కొనుగోళ్లు

చిన్నారులను ఆకాశంలో విహరింపజేసే రంగుల రాట్నం.. చుట్టూ జోరుగా తిరిగే కొయ్యగుర్రం.. రంగురంగుల బెలూన్లు.. నోరూరించే పంచదార చిలకలు.. ఖర్జూరం.. తియ్యటి చెరకుగడలు.. యువతను అలరించే డ్యాన్స్ బేబీ డ్యాన్స్, పెద్దలను ఆకట్టుకునే బుర్రకథా కాలక్షేపం ఇవన్నీ ఒకేచోట.. కొలువుదీరే వేడుక పరస. నియోజకవర్గంలోని గ్రామాల్లో గురువారం నుంచి అమ్మవార్ల పరస(తీర్థా)లు ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకూ సంక్రాంతి సంబరాల్లో మునిగి తేలిన ప్రజలు ఇకనుంచి గ్రామాల్లో జరిగే పరసను ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు.

- నేటి నుంచి గ్రామాల్లో పరసలు ప్రారంభం
- సుందరంగా ముస్తాబైన అమ్మవార్ల దేవాలయాలు
- కోడి పందాలు, జూదాలపై పోలీసుల నిఘా

పెందుర్తి: స్థానిక నియోజకవర్గ పరిధిలో అనేక గ్రామాల్లో కనుమ రోజు రాములవారి తీర్థం జరిగాక అమ్మవార్ల పరసలు ఆరంభమవుతాయి. ప్రతి గ్రామంలోనూ జరిగే ఈ పరసలు మహాశివరాత్రి వరకు కొనసాగుతాయి. పల్లెలతో పాటు నగరంలో కూడా సంప్రదాయ పరసలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. దీని కోసం ఎక్కడెక్కడి నుంచో వ్యాపారులు వస్తారు. దాదాపు ఈ రెండు మాసాలు నియోజకవర్గ పరిధిలోనే బస చేస్తారు. పరసలు జరిగే గ్రామాలకు మూకుమ్మడి వెళ్లి, తమ వ్యాపార/సాంస్కృతిక కార్యక్రమాలతో నాలుగు డబ్బులు సంపాదించుకుంటారు.

సంప్రదాయాలు.. అనుబంధాల ప్రతీక

పల్లెల్లో గ్రామదేవత పరసలు జరుపుకోవడం అనాదిగా వస్తున్న సనాతన సాంప్రదాయం. అమ్మవారి ఆలయం ముందు సాముగరిడీలు, తప్పెటగుళ్లు, భజనలు, కోలాటాలు వంటి జానపద కార్యక్రమాలు చూడముచ్చటగా ఉంటాయి. పరస జరిగే రోజుల్లో పల్లెవాసులు అమ్మవార్లను ప్రత్యేకంగా పూజించి, కానుకలు సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న కుటుంబసభ్యులు, బంధుమిత్రులను ఆహ్వానించి విందులు ఏర్పాటు చేసి ఆప్యాయతలను పంచుకుంటారు. పల్లెవాసులకు ఈ పరసలు అత్యంత ప్రత్యేకం.

చిరువ్యాపారులు, కళాకారులకు భుక్తి

పరసల సమయంలో అనేకమంది చిరువ్యాపారులకు దండిగా ఆదాయం సమకూరుతుంది. పంచదార చిలకలు, ఖర్జూరం, బెలూన్లు, మిఠాయిలు, చెరకుగడలు, ఇతర తినుబండారాలను అమ్ముకుని నాలుగురాళ్లు వెనకేసుకుంటారు. ముఖ్యంగా చిన్నా పెద్దా అందరికీ వినోదం పంచే రంగులరాట్నంకు పరసల్లో మంచి డిమాండ్ ఉంటుంది. చెక్క గుర్రాలపై ఎక్కి, రాట్నం తిరుగుతుంటే పొందే అనుభూతే వేరు. డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్రకథ, సాంఘిక, పౌరాణిక, జానపద నాటకాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల కళాకారులలు బిజీబిజీగా ఉండేది ఈ సమయంలోనే. మొత్తానికి చిరు వ్యాపారులు, కళాకారులకు మామూలు రోజులు కంటే పది రెట్ల ఆదాయం పరసల సమయంలోనే వస్తుంది.

యువతకు ప్రత్యేకం.. ఆటల పోటీలు

గ్రామాల్లో పరస జరిగే రోజుల్లో ప్రత్యేకంగా క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తుంటారు. గ్రామీణ క్రీడలు అయిన కబడ్డీ, ఖోఖోతోపాటు, క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్ వంటి టోర్నీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పల్లె యువత ఉత్సాహంగా పాల్గొంటారు. పరస రోజు వేదిక మీద బహుమతుల ప్రదానోత్సవం అత్యంత వేడుకగా నిర్వహిస్తారు. నగదు బహుమతులు కూడా దండిగానే ఉంటాయి.

జూదరుల జోరు

మరోవైపు పరసల సమయంలో అసాంఘిక కార్యకలాపాలైన కోడి పందాలు, పేకాట, లాటరీ బల్లల వంటి జూద ప్రక్రియలకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంటారు. జూదశిఖామణులను నియంత్రించేందుకు పోలీసులు ఎంతగా దృష్టి సారించినా.. వారి కళ్లుగప్పి రహస్య ప్రదేశాల్లో రూ.వేలు.. లక్షల్లో పందాలు జరుగుతూనే ఉంటాయి. కొన్ని చోట్ల మందుపార్టీలు, రికార్డింగు డ్యాన్స్‌లు ఏర్పాటు చేయడం షరా 'మా మూళ్లే'..! అయితే వీరి ఆటలు కట్టించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



రంగులరాట్నంతో చిన్నారుల సందడి

ప్రత్యేక బృందాలతో నిఘా



పరసల సమయంలో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో పరసలు నిర్వహించుకోవాలని ప్రజల్ని విజ్ఞప్తి చేస్తున్నాం. పరసల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా తీవ్ర చర్యలు ఉంటాయి. జూదం, బెల్ట్ షాపులు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే దగ్గర్లోని పోలీసులకు సమాచారం అందించి, సహకరించాలని ప్రజల్ని కోరుతున్నా.

– కేవీ సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

వైభవంగా శ్రీరాముల తీర్థం



రాముల వారి తీర్థంలో ప్రజల సందడి

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి గ్రామంలో కనుమ పండగ రోజున స్థానిక శ్రీరాముల వారి తీర్థ మహోత్సవం వైభవంగా సాగింది. వాడచీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలు సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. తోడపెద్దులు, తప్పెటగుళ్లు, చిడతల భజన కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. తీర్థ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కృష్ణారాయుడు, సీతారాముల తీర్థాలు



కొత్తరోడ్డు వద్ద కృష్ణారాయుడు స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు కొత్తరోడ్డులోని కృష్ణారాయుడు స్వామి, వంగలి గ్రామంలోని సీతారాముల తీర్థ మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి ఆయా గ్రామాల్లోని భక్తులు స్వామి వార్లను దర్శించుకుని, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన చిడతలు, కోలాటం, భజనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఆకుల శ్రీహేమ, ఎంపీటీసీ గవర తులసి, గ్రామ పెద్దలు ఆకుల గణేష్, గవర రాజు తదితరులు స్వామివార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పండగపూట.. పోలీసుల వేట

- కోడిపందాలు, పేకాట, మద్యం బెల్ట్ దుకాణాలపై దాడులు
- 30 మంది అరెస్ట్.. నగదు, కోడి పుంజులు, మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కోడి పుంజులతో సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది

పెందుర్తి: సంక్రాంతి వేళ కోడిపందాలు, పేకాట శిబిరాలపై పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలోని బృందాలు సోమ, మంగళవారాల్లో ఆరు చోట్ల దాడులు జరిపి పేకాట, కోడిపందాలు ఆడుతున్న 29 మంది వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. ఒక బెల్ట్ దుకాణంపై దాడి చేసి ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు.

- రాజయ్యపేట సమీపంలోని ఓ తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకుని వారి నుంచి రూ.4,280 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- పెదగాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.3,210 నగదును చేజిక్కించుకున్నారు.
- పెందుర్తి అయ్యప్పకాలనీలో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15,050 నగదును స్వాధీనం చేసుకున్నారు.
- గొల్లవిల్లివానిపాలెంలో మద్యం బెల్ట్ దుకాణంపై దాడి చేసి ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతడి వద్ద ఉన్న 9 క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేశారు.
- జుత్తాడ, పులగానిపాలెం సమీపంలోని తోటల్లో జరుగుతున్న కోడి పందాల శిబిరాలపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,880 నగదు, 8 కోడి పుంజులను స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు. కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

సంక్రాంతి క్రికెట్ టోర్నీ విజేత ఒమ్మివానిపాలెం



విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతులను అందిస్తున్న చొక్కాకుల వెంకటరావు తదితరులు

సబ్బవరం: మండలంలోని రావలమ్మపాలెం గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి విలేజ్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. పంచాయతీ స్థాయిలో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొనగా, శివారు గ్రామం ఒమ్మివానిపాలెం జట్టు విజేతగా నిలిచింది. రెండవ స్థానంలో అంతకాపల్లి జట్టు, మూడవ స్థానంలో రావలమ్మపాలెం జట్టు, నాలుగో స్థానంలో రావలమ్మపాలెం విశ్వకర్మ జట్టు నిలిచాయి. విజేతలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు అభినందించారు. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులతో పాటు, ట్రోఫీలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఏటా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, రెడ్డి వాసుదేవరావు, గొంప రమణ, మొల్లి రమణ, బోకం జగదీష్, మేడపురెడ్డి జగన్నాథం, చీపురబిల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోపూజ, గో సంరక్షణతో పుణ్యలోక ప్రాప్తి



అప్పన్న గోశాలలో గోవుకు పూజలు నిర్వహిస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు



గోవుకు పూజలు చేస్తున్న భక్తులు

- అప్పన్న గోశాలలో విశేషంగా గోపూజలు

సింహాచలం: కనుమ పండగని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో బుధవారం గోపూజలను ఘనంగా నిర్వహించారు. గోవులకు పసుపు కుంకుమలు సమర్పించారు. విశేషంగా హారతులు అందించారు. గోశాలలో ఉన్న శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు పాల్గొని మాట్లాడుతూ గోవు సమస్త దేవతాస్వరూపమని, గోమాతను పూజించడం రుషుల కాలం నుంచి వస్తున్న సంప్రదాయమన్నారు. గోవులో సకల దేవతలు, తీర్థాలు కొలువై ఉన్నాయని పేర్కొన్నారు. గోపూజ, గోసంరక్షణ వల్ల పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ గోవుల సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

రాళ్లు తేలి.. గుంతలుగా మారి

- అధ్వానంగా వెంకటాపురం, మెట్టపాలెం రహదారులు
- తక్షణమే రోడ్లను పునరుద్ధరించాలని స్థానికుల మొర



గుంతలమయంగా మెట్టపాలెం రహదారి



రాళ్లు తేలిన వెంకటాపురం రహదారి

పరవాడ: వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం, నాయుడుపాలెం శివారు మెట్టపాలెం గ్రామాల్లో రాళ్లు తేలిన రహదారులతో ప్రజలు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టని కారణంగా కార్మికులు, రైతులు, విద్యార్థులు రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన వెంకటాపురం రహదారిలో రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనాల టైర్లకు నిత్యం పంక్చర్లు పడుతున్నాయి. దీంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడం వలన పండించిన పంట ఫలసాయాలను పట్టణ ప్రాంతాలకు తరలించి అమ్ముకోవడానికి నానా పాట్లు పడుతున్నామని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగించే విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం వర్షం వచ్చినా రోడ్డులోని గోతులు వర్షపు నీటితో నిండిపోయి, రోడ్డేదో.. గొయ్యేదో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధ్వానంగా మారిన నాయుడుపాలెం శివారు మెట్టపాలెం రహదారిలో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని మెట్టపాలెం, పాతరాజన్నపాలెం గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గోతుల మయంగా మారిన రహదారిని అభివృద్ధి చేయాలని మొర పెట్టుకున్నా అధికారులు స్పందించట్లేదని వాపోతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని గుర్తించి, ఇరు రహదారులను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అప్పన్న అన్నదానానికి విరాళాలు



ఏఈవో ఆనంద్‌కుమార్‌కి చెక్కు అందిస్తున్న దాత బుచ్చినాయుడు



సూపరింటెండెంట్ నరసింగరావుకి చెక్కు అందిస్తున్న దాత కిరణ్



దాత ప్రభావతికి బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్



దాత అప్పారావుకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాకకి చెందిన జి.బుచ్చినాయుడు, అనకాపల్లికి చెందిన ఎం.కిరణ్ చెరో రూ.లక్షా 1,116లు విరాళంగా చెక్కుల రూపంలో అందించారు. వీటిని ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పాలూరు నరసింగరావులు అందుకున్నారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రాలను అందించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ పాల్గొన్నారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరానికి చెందిన బి.ఎస్.ప్రభావతి రూ.లక్ష 11 వేల 111, నాగిరెడ్ల అప్పారావు రూ.లక్ష 116 విరాళాలను నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరపున దాతలకు సూపరింటెండెంట్ పి.నరసింగరావు బాండ్లు అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను ఇచ్చారు. మరో సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



చినయాతపాలెంలో గోపూజ నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెం గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో గోపూజ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. పదేళ్లుగా టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవీరాంజనేయస్వామి ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు, మహిళల సహకారంతో కనుమ పర్వదినాన నిర్వహిస్తున్నారు. పురోహితులు స్వయంపాకల వెంకటనారాయణ నేతృత్వంలో జరిగిన గోపూజలో ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, కమిటీ సభ్యులు మళ్ల బాలాజీ, మళ్ల గంగునాయుడు, శరగడం సత్యనారాయణ, దొడ్డి అప్పలనాయుడు, మళ్ల నాగభూషణం, గ్రామ పెద్దలు మళ్ల కోటేశ్వరరావు, మళ్ల వెంకట రమణ, శరగడం రామకోటి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మకరవేట ఉత్సవాన్ని పురస్కరించుకుని కొండదిగువ పూలతోటలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సుజాతనగర్‌లోని సరస్వతీ నృత్య నికేతన్‌కి చెందిన విద్యార్థినుల కూచిపూడి నృత్యప్రదర్శన విశేషంగా అలరించింది. భక్తులు నృత్యప్రదర్శనని తిలకించి, ఆనందపరవశులయ్యారు. మకరవేట సందర్భనకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు పాల్గొని, స్వామివారికి పూజలు చేశారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ముగ్గులను తిలకిస్తున్న ఎంపీ సీఎం రమేష్

సింహాచలం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ యూత్ ఆధ్వర్యంలో వేపగుంట నుంచి అప్పన్నపాలెం వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారిలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. మూడు వందల మంది ఈ పోటీల్లో పాల్గొని రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతలకు వరుసగా 55 అంగుళాల ఎల్‌ఈడీ టీవీ, డబుల్ డోర్ ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్ అందించారు. ప్రోత్సాహక బహుమతులుగా పలువురికి గ్రైండర్, మిక్సీ, కుక్కర్‌ని ఎంపీ సీఎం రమేష్ చేతుల మీదుగా అందజేశారు. పెందుర్తి నియోజకర్గం బీజేపీ కన్వీనర్ గొర్లె రామునాయుడు, స్థానిక నాయకుడు సిగడం నాగేంద్రబాబుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి, కార్పొరేటర్లు రాపర్తి కన్నా, బళ్ల శ్రీను, ముమ్మన దేముడు, పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.